8CTR1:8CTR1.qxd 9/7/2026 11:12 PM Page 1




# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం
వార్షికోత్సవం 1996 - 2026


## పార్వతీపుత్ర పర్యావరణ మిత్ర పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి,సెప్టెంబర్ 7(ప్రభాతవార్త):

25 సంవత్సరాలుగా తిరుపతి నగరంలో నిర్వహించే వినాయక చవితి వేడుకలను, సామూహిక నిమజ్జనాన్ని క్రమశిక్షణతో , సమన్వయంతో నిర్విఘ్నంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ కృషి అభినందనీయమని రాష్ట్రమంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ అందరినీ కలుపుకొని, తిరుపతి ప్రజల మేలుకోరి పనిచేస్తున్నారు . మలినం చిమ్మే రసాయనాలు లేకుండా మట్టి తో చేసిన వినాయకుణ్ణి పూజిద్దామని, స్వామి వారికి సమర్పించే ప్రతి వస్తువూ ప్రకృతి మాత ఒడిలో నుండి వచ్చినవే తిరిగి స్వామిని ప్రకృతి లోనే నిమజ్జనం చేయడం మన సంప్రదాయంఅన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నందున భారీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం కష్ట సాధ్యమవుతుందని, శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఒకేసారి కలిసి వస్తున్నందున నగరంలో అనేక ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,గుండాల గోపీనాథరెడ్డి, ఆర్సి ముని కృష్ణ, చెన్నం నవీన్, కిరణ్, చందు ,నరసింహాయదవ్, పసుపులేటి హరి ప్రసాద్, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్‌వర్మ ,భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### యావత్ దేశ ప్రజలకు

## స్వామివారి కృపాకటాక్షాలు కలగాలి

### శ్రీవారిని సేవలో యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్



తిరుమల,సెప్టెంబర్ 7(ప్రభాతవార్తప్రతినిధి:

యావత్ దేశ ప్రజలకు శ్రీవేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలు కలగాలని కోరుకున్నట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తెలిపారు. ఆలయ నిర్వహణ, ఆధ్యాత్మిక వాతావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై టిటిడికి అభినందనలు తెలిపారు. సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తొలిసారిగా తిరుమల విచ్చేసిన ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలను యుపిసీఎంకు అందజేశారు. తిరుమలలో టిటిడి చేపడుతున్న సమర్థవంతమైన క్యూ లైన్ల నిర్వహణ, పరిశుభ్రత, ఆధ్యాత్మిక వాతావరణ పరిరక్షణను ఆయన అభినందించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీవారి ఆలయంలో కొలువైన సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి ఉత్సవమూర్తులను కూడా ఆయన దర్శించుకున్నారు. ఆ దివ్య రూపాన్ని కూడా తిరుమలలో నేడు దర్శించుకోవడం ఆనందదాయకమన్నారు. పెద్ద జియ్యంగారు ,చిన్న జియ్యంగారు , ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షి తులు ఉన్నారు.



## సెప్టెంబర్‌లో సమ్మర్ షాక్..

### మండుతున్న ఎండలు, కానరాని వర్షాలు

### తల్లడిల్లుతున్న ప్రజలు

తిరుపతి రూరల్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :

సాధారణంగా వర్షాలు కురిసి వాతావరణం చల్లబడాల్సిన సెప్టెంబర్ నెలలోనే మండువేసవి తాపం తలపించేలా ఎండలు తీవ్రంగా పెరిగాయి. ఉదయం నుంచే ఉక్కపోతతో ప్రారంభమయ్యే వాతావరణం మధ్యాహ్నానికి భానుడి భగభగలతో ఉడికిపోతోంది. సాయంత్రం వేళల్లో కూడా చల్లదనం లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాల బదులు వేడి గాలులు వీచడం, మేఘాల కనిపించకపోవడం ఈ కాలానికి విరుద్ధంగా ఉండటంతో ప్రజలు ఆశ్చర్యానికిగురవుతున్నారు. "ఇదెక్కడి వాతావరణంరా బాబు!" అంటూ పెద్దలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎల్‌నినో ప్రభావమా?**

ఈ అసాధారణ పరిస్థితులకు గ్లోబల్ వాతావరణ మార్పుల్లో భాగమైన ఎల్‌నినో ప్రభావమే కారణమై ఉండొచ్చని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా సెప్టెంబర్‌లో వర్షపాతం నమోదవ్వాల్సిన ప్రాంతాల్లో ఈసారి ఎండలు అధికమవడం అదే సంకేతమని చెబుతున్నారు. వర్షాభావం కారణంగా సాగు పనులు ఆలస్యం అవుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంటల సాగుకు తగినంత నీరు లేకపోవడం, భూమి ఎండిపోవడం వల్ల దిగుబడులపై ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు వేసేందుకు ఎదురు చూస్తున్న రైతులు ఆకాశాన్ని ఆశగా చూస్తున్నారు. తీవ్రమైన ఎండల కారణంగా బయట పనులు చేయాల్సిన కూలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో రోడ్లు ఖాళీగా మారుతుండగా, అత్యవసర పనులు తప్ప ప్రజలు బయటకు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 11 నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లకూడదని, తగినంత నీరు, ద్రవాలు తీసుకోవాలని, వృద్ధులు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, తలనొప్పి, అలసట, దాహం ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**అధికారులకు ప్రజల విజ్ఞప్తి**

ప్రస్తుత పరిస్థితులను అధికారులు సమీక్షి ంచి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, రైతులకు సలహాలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతా ల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి బోర్లు ఎండుతున్నా యి. సెప్టెంబర్‌లో చల్లని గాలుల బదులు మండుతున్న ఎండలు ప్రజలకు సమ్మర్ షాక్ ఇస్తున్నాయి. వర్షాలు ఎప్పుడు కురుస్తాయో అనే ఆందోళన మధ్య ప్రజలు తల్లడిల్లుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వ్యవసాయం, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని

## నాణ్యతతో సమస్యలు పరిష్కారం: కలెక్టర్



చిత్తూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందినే అర్జీలను క్షేత్ర స్థాయిలో పక్కాగా పరిశీలించి సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఓ మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, ఇతర సంబంధిత అర్డీఓలతో కలిసి ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీలన నాణ్యతతో పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో వుంచడానికి వీలు లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంకు జిల్లాలోని ప్రజల నుండి సమస్యలుపై 264 అర్జీలు అందాయి.

## టాస్క్ ఫోర్స్‌కు బంగారు పతకాలు

### - మూడు గోల్డ్, రెండు సిల్వర్, ఆరు బ్రాంజ్ పతకాలు
### - పతకాలు సాధించిన కానిస్టేబుళ్లను అభినందించిన ఎస్పీ

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:



విజయవాడలో జరిగిన మొదటి ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో పతకాలు సాధించిన ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) పోలీసులను టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సోమవారం అభినందించారు. రెండు రోజుల క్రితం జరిగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులుకు పతకాల పంట పండింది. వాటర్ స్పోర్ట్స్ కాయాకింగ్ విభాగంలో ఎం. హాజువలికి రెండు గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలను సాధించారు. ఏ. విద్యాసాగర్‌కు ఒక గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలు సాధించారు. వారిని టాస్క్‌ఫోర్స్ యస్.పి శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు చేపట్టిన కృషితోనే పతకాలు సాధించుకున్నారని, టాస్క్ ఫోర్స్‌కు పేరు తీసుకుని వచ్చారని తెలిపారు. ఇలాంటి పతకాలు భవిష్యత్తులో మరిన్ని సాధించాలని ప్రోత్సహించారు. వారిని అభినందించిన వారిలో ఏఎస్పీ జె. కులశేఖర్, డీస్పీలు ఎండీ షరీఫ్, వీ శ్రీనివాసరెడ్డి, బీ. సాయి గిరిధర్, ఏసీఎఫ్. జె.శ్రీనివాస్ ఉన్నారు. అనంతరం క్రీడాకారులను సత్కరించి అభినందనలు వ్యక్తం చేశారు.

### బ్రహ్మోత్సవ ఏర్పాట్లును పరిశీలించిన ఈఓ



కాణిపాకం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లును సోమవారం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆలయ ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. దేవస్థానంలో ఈనెల 14 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. బ్రహోత్సవాల నిర్వహణ గడువు దగ్గర పడుతుండడంతో ఆలయ అధికారులు ఏర్పాట్లును యుద్ధప్రాతిపదిక సాగిస్తున్నారు. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం పనులు దాదాపుగా పూర్తి కావస్తోంది. బ్రహ్మోత్సవాల ప్రచారంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఫైవుడ్,ఎలక్ట్రికల్ ఆర్చిలను సిద్ధం చేస్తున్నారు.అలాగే భక్తుల క్రమ బద్ధీకరణకు ఆలయం లోపుల, వెలుపల క్యూలైన్లును ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానం వద్ద జరుగుతున్న పెయింటింగ్, క్యూలైన్లు, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు పనులను ఆలయ ఈఓ పెంచల కిషోర్ పరిశీలించారు.బ్రహ్మోత్సవాలకు ముందుగానే ఏర్పాట్లు అన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆలయ ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, ఇంజనీరింగ్ శాఖ ఏఈఓల శివాంజనేయులు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### పాకాలలో రెండు రైల్వే ఫ్లైఓవర్లకు

## తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

### రూ.250 కోట్ల రైల్వే అభివృద్ధి పనుల్లో ఫ్లైఓవర్ల నిర్మాణం చేర్చాలని డిమాండ్

పాకాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా పాకాల పట్టణంలో రైల్వే లైన్లపై రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. పాకాల జంక్షన్ పరిధిలోని రైల్వే గేట్ల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో రైల్వే గేట్లు మూసివేయడంతో వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే వాహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తిరుపతి-కాట్పాడి బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గం నూతన నిర్మాణం, ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో, ఈ అభివృద్ధి పనుల్లో పాకాలలోని రెండు రైల్వే లైన్లపై ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని కూడా చేర్చాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వే గేట్ల వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే ఫ్లైఓవర్ల నిర్మాణమే మార్గమని స్థానికులు పేర్కొంటున్నారు. మంజూరైన నిధుల్లోనే ఈ పనులకు ప్రాధాన్యత కల్పించి, నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు. పాకాల పట్టణ అభివృద్ధితో పాటు ప్రయాణికుల భద్రత, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా రాకపోకలు సాగేందుకు ఈ రెండు ఫ్లైఓవర్లు ఎంతో కీలకమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి పాకాల రైల్వే ఫ్లైఓవర్ల నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కుప్పం ఎఎస్పీగా హేమంత్ బొడ్డు నియామకం

కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం అదనపు ఎస్పీగా ఐపిఎస్ అధికారి హేమంత్ బొడ్డు నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పంలో ఇదివరకు డిఎస్పీగా ఉన్న పార్థసారథిని బదిలీ చేస్తూ డిజిపికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా కుప్పం ఎఎసీ ్పగా నియమితులైన హేమంత్ బొడ్డు 2023 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఈయన యుపిఎస్సి ద్వారా డైరెక్ట్ రి క్రూట్ అయ్యారు. ఆంధ్ర కేడర్‌కు చెందిన ఈయన ప్రస్తుతం పోలవరం జిల్లా చింతూరు సబ్ డివిజన్ ఎఎస్పీగా ఉన్నారు. బిటెక్ చదివిన ఈయన యుపిఎస్సి ద్వారా రి క్రూట్ అయి 13-11-2023న ఐపిఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. 2025 నుంచి ఎఎస్పీగా కొనసాగుతున్నారు. కుప్పానికి ఎఎసీ ్పని నియమిస్తామని ఇదివరకు సిఎం చంద్రబాబు పేర్కొన్న నేపథ్యంలో ఈనియామకం జరిగింది.

## తిరుపతి జిల్లాలో స్థానిక పోరుకు టిడిపి సన్నద్ధం!

### -నేతల మధ్య వర్గ పోరుకు చెక్ -సమర్థులైన మహిళా నేతలగుర్తింపు



ప్రభాతవార్త-తిరుపతి:

స్థానిక సంస్థల ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని సిఎం,టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన దిశానిర్దేశం తిరుపతి జిల్లాలో పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన స్పష్టం చేసిన నేపథ్యంలో జిల్లా నాయకత్వం ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతిలో ఉన్న గ్రూపులు, వర్గాలను ఒక తాటిపైకి తేవాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లాలో కూడా అందరి మధ్య సమావయం సాధించాల్సి వస్తుంది. తిరుపతి జిల్లాలో ముఖ్యంగా తిరుపతి నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీల్లో పార్టీ బలాబలాలను అంచనా వేయాల్సిన అవసరం ఉంది. గత ఎన్నికల ఫలితాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, స్థానికంగా నాయకుల ప్రభావం, కూటమి పార్టీల మధ్య సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేపట్టే అవకాశం ఉంది. పార్టీలోని నేతల మధ్య ఎలాంటి గ్యాప్‌లు ఉండకూడదన్న చంద్రబాబు సూచన తిరుపతి జిల్లాలో కీలకంగా మారింది. స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత విభేదాలు, వర్గపోరు పార్టీ విజయావకాశాలను దెబ్బ తీయకుండా టిడిపి, జనసేన, బీజేపీ నేతల మధ్య సమన్వయం పెంచాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రత్యేకంగా తిరుపతి నగరంలో మేయర్ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆశావహులు, పార్టీ సీనియర్ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం అత్యంత కీలకం కానుంది. మహిళలకు రిజర్వు అయ్యే స్థానాల్లో కేవలం పార్టీకి చెందిన వ్యక్తులను ఎంపిక చేయడం కాకుండా సమర్థవంతంగా పనిచేయగల మహిళా నాయకులను ముందుగానే గుర్తించాలని చంద్రబాబు సూచించారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాలో గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలో చురుగ్గా పనిచేస్తున్న మహిళా నాయకులపై పార్టీ దృష్టి సారించే అవకాశం ఉంది జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, పర్యాటకం, మౌలిక వసతులు తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ భావిస్తోంది.ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ఎన్నికల్లో ప్రధాన ప్రచార అంశాలుగా మలచుకునే అవకాశం ఉంది. తిరుపతి జిల్లాలోనూ పార్టీ సంస్థాగత బలం, నాయకుల పనితీరు, స్థానిక సమస్యలు, అభ్యర్థుల బలాబలాలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిగే అవకాశం ఉంది. చంద్రబాబు దిశానిర్దేశంతో స్థానిక ఎన్నికల వేడి మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## ప్రకటనలకే పరిమితం...ఆర్‌డిఓ కార్యాలయ భవన నిర్మాణం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:




శ్రీకాళహస్తిలో ఆర్‌డిఓ కార్యాలయం ఏర్పాటు చేసి సుమారు ఐదేళ్ళు దాటింది. అయితే ఇంకా పరాయి పంచనే కాపురం సాగిస్తుందనే విమర్శలు చోటు చేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అందమైన ఆర్‌డిఓ కార్యాలయం ఉండాలనే లక్ష్యంతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. మొదట అయ్యలనాడు చెరువులోని ఆర్‌అండ్‌బి అతిధి గృహం అయితే ప్రజలకు అందుబాటులో ఉంటుందని భావించి పరిశీలించారు. అయితే వర్షాకాలం అక్కడ నీరు చేరుతుంది కాబట్టి దానిని వద్దనుకున్నారు. అయితే పానగల్‌లోని ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న బిసి హాస్టల్‌స్థలం అయితే అన్ని విధాలా అనుకూలమనుకున్నారు. ఈ మేరకు ప్రస్తుత ఆర్‌డిఓ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా పంపినట్లు సమాచారం. అయితే ఏడాది దాటినా అతీగతి లేదు. ప్రతిపాదనలు ఆచరణ గడపదాటలేదు. పాతికేళ్ళుగా శ్రీకాళహస్తిలో ఆర్‌డిఓ కార్యాలయం ప్రతిపాదనలు సాగేవి. అవి వైకాపా హయాంలో ఆచరణకు నోచుకున్నాయి. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం మంజూరు అయ్యింది. వైకాపా పరిపాలన మూడేళ్ళు సొంత భవనాల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఆర్‌డిఓ కార్యాలయం మా గోప్ప అని ప్రకటించుకున్న వైకాపా నాయకులు మంజూరు అయిన ఆర్‌డిఓ కార్యాలయాన్ని తాత్కాలికం అంటూ మార్కెటింగ్ కమిటి యార్డులోని మార్కెటింగ్ కమిటి భవనాలు ఒక దానిలో కాపురం ఏర్పాటు చేసారు. అయితే ఆ తాత్కాలికం ఎప్పటి వరకు అన్నది తేలకుంది. తిరుపతిజిల్లా ఆన్‌చార్జిగా రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉన్నారు. ఆయన కూడా ఇక్కడ ఆర్‌డిఓ కార్యాలయంకు సొంత భవనాలు మంజూరు చేయాలనే దిశగా అడుగులేయటం లేదు. శ్రీకాళహస్తిలో ఆర్‌డిఓ కార్యాలయం 2022లో మంజూరు అయ్యింది. అప్పటిలో అట్టహాసంగా పాలకులు ప్రారంభోత్సవం ఏర్పాటు చేసారు. మొదటి ఆర్‌డిఓగా మహిళా అధికారిని నియమించారు. ఏప్రిల్ 4,2022లో మార్కెటింగ్ కమిటి ఆవరణలో మార్కెటింగ్ కమిటి నిర్మించిన 'రైతు విశ్రాంతి భవనాన్ని' ఆర్‌డిఓ కార్యాలయం విడిదిగా మలచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ నియమించిన యువ ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి సొంత భవనాల ప్రతిపాదన తెరమీదకు తెచ్చారు. అయితే ఏడాది దాటినా ఆ ప్రతిపాదనలు ప్రభుత్వం గడపదాటలేదు. రెవెన్యూ శాఖ భవనాలకే రెవెన్యూశాఖలో దిక్కులేదన్నట్లు పరిస్థితి మారింది.జిల్లా ఇన్‌చార్జి మంత్రితో ఎంతో సన్నిహితంగా ఉండే శాసనసభ్యుడు ఆర్‌డిఓ కార్యాలయం సొంత భవనాల గురించి అనుమతి సాధించుకోవాల్సి ఉంది.

వార్త
తిరుపతి ,చిత్తూరు జిల్లాలు, ♦ మంగళవారం 8 సెప్టెంబర్ 2026



# తిరుపతి డివిజన్

# స్వచ్ఛ గాలి కోసం ప్రజల భాగస్వామ్యం అవసరం





## వాయు కాలుష్య నియంత్రణపై అవగాహన.. తిరుపతిలో మొక్కలు నాటడం, చిత్తూరులో గ్రీన్ ర్యాలీ

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

వాయు కాలుష్య నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు, నిపుణులు పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ వాయు దివాస్-2026 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతిలోని రీజనల్ సైన్స్ సెంటర్లో జరిగిన కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి మురళి మోహన్, అమర రాజా ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత సైన్స్ సెంటర్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వాయు కాలుష్యానికి కారణాలు, దుష్ప్రభావాలు, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వాహన కాలుష్యాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, విరివిగా మొక్కలు నాటడం, పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నాగిరెడ్డి, శంకర్ రావు, రీజినల్ ఆఫీస్ ఈఈతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు, పరిశ్రమలు, ఆసుపత్రుల ప్రతినిధులు, రీజనల్ సైన్స్ సెంటర్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిత్తూరులో గ్రీన్ ర్యాలీ...ఇదే సందర్భంగా చిత్తూరు పట్టణంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, స్వచ్ఛమైన గాలి ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎంహెచ్ఓ అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరి కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అనలిస్ట్ గణేష్ కుమార్తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనాల వినియోగంలో జాగ్రత్తలు పాటించడం, ప్రజా రవాణాను వినియోగించడం, చెట్లను పెంచడం, వ్యర్థాలను బహిరంగంగా దహనం చేయకపోవడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే కాలుష్య నియంత్రణ చర్యలకు ప్రజల సహకారం అవసరమని, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.

## సర్వేలో అవకతవకలు

**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 07, ప్రభాతవార్త:**



ఆంధ్ర ప్రదేశ్ యానాది సంఘం మరియు పరివర్తన సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ని సోమవారం కలిసి కొత్తూరు యానాది కాలనీ, కొత్తూరు పంచాయతీ, రంగంపేట, కి.వి.బి పురం మండలం, తిరుపతి జిల్లాకు చెందిన 18 పేద యానాది కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా నవంబర్ 13, 2010 వ తేదీన సర్వే నెం. 1456 లో ఎ 1.30 సెంట్లు చొప్పున డి.కే.టి పట్టాలు ఇవ్వడం జరిగింది. ఈ భూమిలో పేద యానాది కుటుంబాలు హౌసింగ్ ఇళ్ళు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతంలో టీటీడీ ఆధ్వర్యంలో గుడి నిర్మాణం కూడా జరిగింది. ఇదే స్థలంలో భాగంగా గతంలో ఎమ్మార్వోచే నివాస ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు కూడా జారీ చేయబడ్డాయి. కానీ ఇటీవల ఎమ్మార్వో స్థాయి సర్వేలో కొన్ని అవకతవకలు జరిగాయి. గ్రామంలోని ఎదురుగా ఉన్న ఏదిరాయ మునస్వామి అనే వ్యక్తి పేరును చూపించి మా యానాది కుటుంబాలకు చెందిన 1.30 సెంట్ల భూమికి అతని పేరు మీద తప్పుడు రికార్డు సృష్టించడం జరిగింది. మునస్వామి పేరు మీద నుండి వెంటనే తొలగించి అసలైన లబ్ధిదారులైన 13 యానాది, గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలని సంచార తెగలు సంచార జాతులు మహిళా సంఘాల జిల్లా ఇన్చార్జి ,పరివర్తన సేవా సంస్థ అధ్యక్షులు పల్లం అమరనాథ్, ఆంధ్ర ప్రదేశ్ యానాది సంఘం అధ్యక్షులు చంద్రమాముల కోటయ్య కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ యానాది సంఘం పి సూరమ్మ, టీ మునిస్వామి, పరివర్తన సేవా సంస్థ సిబ్బంది పి రాణికుమారి, టీ దిల్ రాజ్, టీ లక్ష్మి పాల్గొన్నారు.

## 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి - ఎస్టీయూ

**వరదయ్యపాలెం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటిచాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వెంపల్ల చిన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం వరదయ్యపాళెం మండలంలోని వివిధ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు సమస్యల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంబూరు వైసి మోడల్ ప్రైమరీ స్కూల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిటీ నియామకాన్ని వెంటనే చేపట్టాలని, 30 శాతం మధ్యంతర భృతి తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి పి సూరి బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సిపియస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సి శ్యామ సుందర్, ముజీబ్, పురుషోత్తం, దుర్గారావు శ్రీనివాసులు, ఉదయ రేఖ పాల్గొన్నారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ జరిగిన సంఘటన సోమవారం అనుప్పల్లి పంచాయతీ, గడ్డక్రిందపల్లిలో చోటుచేసుకున్నది. బాధితుల వివరాల మేరకు.. గడ్డక్రిందపల్లికి చెందిన మోహన్‌రెడ్డి భార్య కళావతి తమ పొలం వద్ద పశువులను మేపుతుండగా గుర్తు తెలియని ఇద్దరు యువకులు అనుమానాస్పందంగా తిరుగుతున్నారు. వారిని కళావతి ఎవరని ప్రశ్నించగా వెంటనే ఓ యువకుడు మెడలో వున్న 54 గ్రాములు తాళిబొట్టుతో సహా చైన్‌ను లాక్కుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలికి చేరుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తిరుపతిలో కొత్త పల్సర్ వాహన శ్రేణి ఆవిష్కరణ

### ఎంజీబీ బజాజ్ షోరూమ్‌లో పల్సర్ 125, 150, ఎన్160 మోడళ్లు




**తిరుపతి విద్య సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**

నగరంలోని ఎంజీబీ బజాజ్ షోరూమ్‌లో సరికొత్త పల్సర్ వాహన శ్రేణిని సోమవారం ఆవిష్కరించారు. పల్సర్ బ్రాండ్ 25 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా రెండు కోట్లకు పైగా వాహనాలు విక్రయించిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు నందాని ఫ్యామిలీ, రవి, కిరణ్ తదితరులు పాల్గొని కొత్త మోడళ్లను ఆవిష్కరించారు. పల్సర్ 125, పల్సర్ 150, ఎన్160 మోడళ్లకు కొత్త డిజైన్‌తో పాటు పలు అధునాతన ఫీచర్లను జోడించినట్లు షోరూమ్ నిర్వాహకులు తెలిపారు. పల్సర్ 150లో కొత్త ఇంజిన్, మూడు రైడింగ్ మోడ్‌లు, ఐడిల్ స్టార్ట్/స్టాప్, ఆయిల్ కూల్డ్ ఇంజిన్ వంటి సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, గూగుల్ మ్యాప్స్ మిర్రరింగ్, యూఎస్‌బీసీ ఛార్జింగ్, ఎల్ఈడీ లైట్లు, ట్విన్ డిస్క్ బ్రేకులు తదితర ఫీచర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాహనాల బుకింగ్‌లు కొనసాగుతున్నాయని, పరిమిత స్టాక్ ఉన్నందున ముందుగా బుక్ చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం. శ్రీనివాస్, ఎంసీబీప్రో శ్రీకాంత్, హెచ్ఆర్ మూర్తి, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపోతులరాజు కొలుపులో పాల్గొన్న మాజీమంత్రి



**విజయపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**

విజయపురం మండలం కోసలనగరం గ్రామంలో నిర్వహించిన శ్రీ పోతులరాజు కొలుపు కార్యక్రమంలో మాజీమంత్రి, వైసీపీ నాయకురాలు రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన రోజాకు గ్రామస్తులు, భక్తులు శాలువ కప్పి, గజమాల వేసి ఘన స్వాగతం పలికి పోతులరాజు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనభాగ్యం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా ఆనవాయితీగా కొనసాగుతున్న సాంప్రదాయ, ఆధ్యాత్మిక ఆచారాలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని రోజా పేర్కొన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పర్శలేని మచ్చలుంటే జాగ్రత్త




**పులిచెర్ల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వాటి పట్ల నిర్లక్ష్యం వహించకుండా వైద్యుల సలహా తీసుకోవాలని ఎల్లంకివారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎల్లయ్య పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమంపై మండల స్థాయి అధికారుల సమన్వయ కమిటీ సమావేశం పులిచెర్ల మండల అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఆషా కార్యకర్తలు, మేల్ వాలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి వైద్యుల వద్దకు పంపడం జరుగుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు కుష్టువ్యాధి లక్షణాలలో ప్రధానమైనదని, చెవులపై, వీపుపై, మెడ పై నొప్పిలేని బుడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవటం, కనురెప్పలు మూతపడకపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం, అరచేతులు అరికాళ్ళలో స్పర్శ కోల్పోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం లాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధి పట్ల ఎలాంటి భయాలు, అపోహలు అవసరం లేదని, బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ జయసింహ, మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్ బాబు, పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డిప్యూటీ యంపిడిఓ హరికుమార్, ఆరోగ్య విస్తరణాధికారులు చంద్రయ్య, కృష్ణయ్య, ఐసిడియస్ సూపర్వైజర్లు సుహాసిని, విజయలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి



**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :**

ఆశ వర్కర్స్ జీతాలు పెంచాలని పనిభారం తగ్గించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రీవెన్స్ నందు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హేమావతి చాముండేశ్వరి జిల్లా ఆఫీస్ బేరర్స్ ధనలక్ష్మీ మారెమ్మ, జిల్లా అధ్యక్ష కార్యదర్శి హేమావతి మాట్లాడుతూ కూటమి నేతలు ఇచ్చిన హామీలకు జిఓ లు విడుదల చేయాలి సంక్షేమ పథకాలు అమలుపరచాలి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలకు తక్కువ లేకుండా ఇవ్వాలని, రాత్రి డ్యూటీలు వేయడం మానుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 11న జరిగే రాష్ట్ర సదస్సు ను విజయవాడలో నిర్వహిస్తున్నామని ఈ రాష్ట్ర సదస్సు కు జిల్లా నుండి పెద్ద ఎత్తున ఆశలు వర్కర్ల కదలి రావాలి అని వారు పిలుపునిచ్చారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**విజయపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**

విజయపురం, నింద్ర పోలీస్‌స్టేషన్ల పరిధిలో వినాయకచవితి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని నగరి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ నిర్వాహకులకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విగ్రహానికి సంబంధించి నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలని, వినాయక చవితిపండుగను శాంతియుతంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ గణేష్ ఫెస్టివల్ పర్మిషన్ యాప్, గణేష్ ఉత్సవ్, నెట్ ద్వారా ఉచితంగా అనుమతి పొందవచ్చన్నారు. వినాయక మండపం వద్ద క్యూఆర్ కోడ్‌ని తప్పని సరిగా ప్రదర్శించాలన్నారు. మండపాలవద్ద నిబంధనలు పాటించాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆలయ మహా కుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా



**విజయపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**

మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామంలో శ్రీ పార్వతీదేవిసమేత కుశస్థలేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి రోజా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన మహా కుంభాభిషేక కార్యక్రమంలో ఆమె పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్‌వీ ఆర్ట్స్ కళాశాలలో తొలి అడ్మిషన్

### 2026-27 విద్యా సంవత్సరానికి తొలి విడత అడ్మిషన్లకు శ్రీకారం



**తిరుపతి విద్య సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉన్నత విద్యాశాఖ తొలి విడత అడ్మిషన్ జాబితాను విడుదల చేసిన నేపథ్యంలో, రాయలసీమలో ప్రతిష్టాత్మకమైన శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల (ఎస్‌వీ ఆర్ట్స్), టీటీడీ, తిరుపతిలో నూతన విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్‌తో పాటు అటానమస్ హోదా కలిగిన కళాశాలలో తొలి విద్యార్థిగా బి. రామశేష సాయి శివారెడ్డి బీఎస్సీ ఆనర్స్ (జువాలజీ) ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డాక్టర్ గూగులోత్ కిషన్ విద్యార్థికి బీఎస్సీ ఆనర్స్ జువాలజీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ అందజేసి అభినందించారు. నూతన విద్యా సంవత్సరంలో కళాశాలలో తొలి అడ్మిషన్ పొందడం ఆనందంగా ఉందని, విద్యార్థులు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షి ంచారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జున్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు కళాశాలలో అవసరమైన సదుపాయాలు, విద్యా వాతావరణం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నూతన విద్యార్థులకు కళాశాల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ లలిత, అధ్యాపకులు డాక్టర్ మేడికొండ ప్రసాదరావు, డాక్టర్ కిరణ్ కుమార్ రాజు, అన్నయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. రమేష్ చంద్ర మోహన్ రెడ్డి, సరస్వతి, అడ్వకేట్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థి రామశేష సాయి శివారెడ్డి, ఆయన తల్లిదండ్రులను అభినందించారు. నూతన విద్యా సంవత్సరంలో కళాశాలలో తొలి అడ్మిషన్ పొందిన విద్యార్థిగా రామశేష సాయి శివారెడ్డి నిలిచారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**పాకాల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

50 సంవత్సరాల క్రితం పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు నేడు అపూర్వక కలుసుకున్నారు. పాకాల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు 1976వ సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 50 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాన్ని జరుపుకున్నారు. సోమవారం పాకాల మండలంలోని చిన్నగోర్పాడు (రామాపురం) నాదెళ్ల విశ్వనాథం నాయుడు మ్యాంగో గార్డెన్ నందు కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి వారి జీవిత అనుభవాలను పంచుకొంటూ, సహపంక్తి భోజనాలు భుజించి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, సాయంత్రం వరకు సరదాగా గడిపారు. సుమారు 40 మంది వరకు దూరప్రాంతాల నుండి రావడం సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎన్ శివరాం ప్రసాద్, సతీష్ కుమార్, రాజశేఖర్, విశ్వనాథం నాయుడు, మధు, బుజ్జి బాబు నాయుడు, గోవర్ధన్, ఆర్.వి.ప్రసాద్, సాళ్ళహుదీన్ నిరూప, శశికళ, హెన్న, రాజమణి, భువనేశ్వరి, జ్యోతి, బాలాజీ, సుందరమ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీ కోదండరాముడు



**చంద్రగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం శ్రీ కోదండరాముల వారు తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామచంద్రమూర్తి స్వామి వారి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రంను పురస్కరించుకుని శ్రీసీతాలక్ష్మణ, ఆంజనేయస్వామి సమేతుడై వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, జమేధార్ మూర్తి, అర్చకులునారాయణాచార్యులు, రాజశేఖర్ స్వామి, రవిచంద్రన్, తిరువేంగడం స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణారావు సేవలు అభినందనీయం

### పదవీ విరమణ సన్మానంలో వైస్ ఛాన్సలర్ కృష్ణమూర్తి



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా సేవలందించి పదవీ విరమణ చేసిన వై.వి. కృష్ణారావును విశ్వవిద్యాలయం ఘనంగా సన్మానించింది. శ్రీ రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం అభివృద్ధిలో కృష్ణారావు సేవలు అభినందనీయమన్నారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం హోదా పొందిన అనంతరం పలు నియమ నిబంధనల రూపకల్పనలో ఆయన కీలకంగా పనిచేశారని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా సాగాలని ఆకాంక్షి ంచారు. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు, అకాడమిక్ డీన్ ప్రొ. రజినీకాంత్ శుక్లా కలిసి కృష్ణారావును దుశ్శాలువ, స్మృతిచిహ్నంతో సత్కరించి, పదవీ విరమణ ప్రయోజనాలను అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ నాయకుల అక్రమాలను... అడ్డుకోవాలంటూ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు



పెళ్లకూరు, సెప్టెంబర్ 7(ప్రభాతవార్త): మండలంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకుంటున్నారంటూ సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చిల్లకూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అధికార పార్టీ నాయకుల అవినీతిపై ఆయన మాట్లాడుతూ పెళ్లకూరు పంచాయతీలో 35 ఎకరాలలో లేఅవుట్లు వేయగా 10 శాతం పంచాయతీకి ఇచ్చిన ప్లాట్లను అధికార పార్టీకి చెందిన పేరం రమేష్ నాయుడు మరి కొంతమందితో కలిసి ఆక్రమించుకున్నారని అదేవిధంగా చిల్లకూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు చైతన్య కృష్ణారెడ్డి అతని బంధువులు రాణి గారి తోటలో సర్వే నెం:79లో ఉన్న ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటుంటే రెవెన్యూ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఈ విషయంలో న్యాయస్థానాల్ని ఆశ్రయించి ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. చిల్లకూరు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయం కోర్టు పరిధిలో ఉందని అధికార పార్టీ నాయకులు కోర్టు ఆదేశాలను దిక్కరించి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే మాకు కూడా ఎలా అడ్డుకోవాలో తెలుసంటూ కూటమి నాయకులకి సవాల్ విసిరారు.

## పిజిఆర్ఎస్‌లో కామిరెడ్డి భూ కబ్జాపై ఫిర్యాదు



పెళ్లకూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: చిల్లకూరు గ్రామానికి చెందిన వైఎస్ ఆర్‌సిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి చిల్లకూరు రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి ప్రక్కన కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించి తన కుటుంబ సభ్యులు పేరుమీద తప్పుడు రికార్డులు సృష్టించి భూదందా చేశారని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ భూ దందాపై వినతి పత్రాన్ని సమర్పించి ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ వినతిని సమర్పించిన వారిలో పేరం రమేష్ నాయుడు, పేరం మధుసూదన్ నాయుడు, వేలూరు మురళీకృష్ణారెడ్డి, శిరసనం భేటీ చైతన్య కృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, లోకేష్ నాయుడు ఉన్నారు.

## చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సిఐ



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక సీఐ ఎం మురళీకృష్ణ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్టకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలన్నారు. అలాగే డీజేలు నిషేధమని, వినాయక మండపాల వద్ద రాత్రి వేళల్లో ముగ్గురు వాలంటీర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి కాళంగి నదిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని దీనికి సంబంధించి స్థల పరిశీలన చేసి ఎంపిక చేయడం కూడా జరిగిందన్నారు. నిమజ్జన ఉత్సవాల్లో ఎవరు కూడా మద్యం సేవించి పాల్గొనకూడదని అట్లు పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ డెకరేషన్‌కి సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## సంక్షేమ పథకాల అమలు బాధ్యత...ప్రజా ప్రతినిధులదే



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవ్వాలా వాటిని అమలు చేయడంలో ప్రజాప్రతినిధులు పూర్తి బాధ్యత వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో అత్యంత ప్రతిష్మాకంగా నిర్వహించిన లీడర్ షిప్ కాంక్లేవ్ సమావేశంలో ఆయన ప్రసంగిచారు. రాష్ట్రాన్ని అని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నాయకులంతా సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రసంగం అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉందని ఆయన ఇచ్చిన మార్గ నిర్దేశనంతో నియోజకవర్గ అభివృద్ధితో పాటు, ప్రజల శ్రేయస్సు వారి సమస్యలను తీర్చడంలో అంకితభావంతో పనిచేస్తానని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి లోకేష్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పొలిట్ బ్యూరో సభ్యులు, జోనల్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## వినతి పత్రాలను పరిశీలించి పరిష్కరిస్తాం : ఎంపీడీవో



వెంకటగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: సమస్యలపై వచ్చిన వివిధ పత్రాలను పరిశీలించి పరిష్కరిస్తామని ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా పలువురు సమస్యలపై ఎంపీడీవోకు వినతి పత్రాలు అందజేశారు. ప్రజా విజ్ఞప్తి దినంలో వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. వెలుగు కార్యాలయంలో సిబ్బంది సరిగా పనిచేయడం లేదని సమాచార హక్కు చట్టం కమిటీ అధ్యక్షులు విజయరాజు ఎంపీడీవోకి వింత పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ కాలనీలో భూ సమస్యలపై వింత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శిరీష సిబ్బంది పాల్గొన్నారు.

## భరోసా పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరణ

వెంకటగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లకు ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ తెలిపారు. దరఖాస్తులను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అన్ని డాక్యుమెంట్‌తో సమర్పించాలి అని చెప్పారు. ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఇతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి అని తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ వయసు నిర్ధారణ కోసం ఆధార్ కార్డు, వితంతువులు భర్త ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలు విడాకులు పత్రాలు, వికలాంగులు అయితే సదరన్ సర్టిఫికేట్ సమర్పించాలి అని చెప్పారు. ప్రభుత్వాన్ని నిబంధనల ప్రకారమే అరులైన వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంజూరు చేస్తారు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి



తడ సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: తడ మండలంలోని గ్రామాల్లో ప్రధాన సమస్యలైన తాగునీరు, పారిశుద్ధం, వీధి దీపాలపై సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డి. కిరణ్ కుమార్ తడ మండల ఎంపీడీవో శేఖర్ నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అనపగుంట గ్రామంలో తీవ్రంగా ఉన్న నీటి సమస్య, పారిశుద్ధ్య లోపం గురించి ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఇరకం గ్రామంలో పంచాయతీ నీరు వదిలే వ్యక్తికి నాలుగు నెలలుగా జీతం ఇవ్వడం లేదని తెలియజేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో వెంటనే తన ఫోన్ ద్వారా సంబంధిత సెక్రటరీలకు ఫోన్ చేసి, ఈ సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంభాకం హరికృష్ణ, జిల్లా కిసాన్ విభాగం అధ్యక్షులు జోగి వినోద్, మండల కార్యదర్శి బొగ్గుల సురేష్ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వినాయక చవితి కమిటిలు పోలీసులతో సహకరించాలి

### -డిజేలకు అనుమతి లేదు : డిఎస్పీ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: రానున్న వినాయక చవితి సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు కమిటీలు పోలీసులతో సహకరించాలని డివైయస్‌పి నరసింహామూర్తి సోమవారం కోరారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో పోలీసులు బందోబస్తుతో తలమునకలై ఉన్నామన్నారు. ఇక వినాయక చవితి సంబరాలంటే యువకుల్లో జోష్ ఉందని శ్రీకాళహస్తి పరిధిలో వందకుపైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం అందిందన్నారు. అయితే ఎవరు ఎక్కడ మండపాలను ఏర్పాటు చేసుకున్న ముందస్తు పోలీసుల అనుమతి అవసరమని డివైయస్‌పి వివరించారు. అనుమతులనుమరింత సులభ తరం చేయటానికి ఆన్‌లైన్‌లో మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎపిగణేష్‌ఉత్సవ్ పోర్టల్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసారని అందులో అనుమతి సాధించుకోవచ్చునని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రతి చోట పోలీసులు అప్రమత్తంగా ఉన్నామన్నారు. ఎక్కడా ఎటువంటి గొడవలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో డిజేలకు పూర్తిగా అనుమతి ఇవ్వటం లేదని కమిటీలు సహకరించాలని డివైయస్‌పి సూచించారు. వినాయక చవితి సంబరాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. కమిటి సభ్యులు కోరితే బందోబస్తును అందిస్తామన్నారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ వెంకటేష్, రూరల్‌సిఐ ఇబ్రహీంలు పాల్గొన్నారు.

# నూకసాని బాలాజీకి...తిరుపతి ఎన్నికల బాధ్యతలు



తిరుపతి, సెప్టెంబర్ 7(ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీని తిరుపతి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. జిల్లాలో అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారం, పార్టీ శ్రేణుల సమన్వయం, కూటమి పార్టీలతో సమన్వయం వంటి కీలక బాధ్యతలను ఆయన నిర్వర్తించనున్నారు. నూకసాని బాలాజీ ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. 2014కు ముందు ఆయన వైసిపిలో కొనసాగుతూ జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ తరువాత టిడిపిలో చేరి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. పార్టీలో తొలుత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 2020 నుండి జిల్లా స్థాయిలో పార్టీకి నాయకత్వం వహిస్తూ బలహీనవర్గాలను సమీకరించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన పార్టీ కోసం చేసిన కృషికి గుర్తింపుగా గత టిడిపి ప్రభుత్వ హయాంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా అవకాశం లభించింది. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూకసాని బాలాజీని నియమించింది. 2024 అక్టోబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. బీచ్ టూరిజం అభివృద్ధి, బ్లూ ఫ్లాగ్ గుర్తింపు, పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా ఆయన దృష్టి సారించారు. ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఈయన్ను తిరుపతి జిల్లా ఎన్నికల బాధ్యతలు అప్పగించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుపతి వంటి రాజకీయంగా కీలకమైన జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నుంచి కూటమి పార్టీల మధ్య సమన్వయం వరకు అనేక సవాళ్లు ఆయన ముందున్నాయి. మరోవైపు జనసేన కూడా ఎన్నికల సమన్వయ కమిటీని ప్రకటించిన నేపథ్యంలో టిడిపి-జనసేన- బీజేపీ కూటమి మధ్య సమన్వయం సాధించడం బాలాజీకి ప్రధాన బాధ్యతగా మారనుంది.

## రామాలయాలు...ఆధ్యాత్మికతకు నిలయాలు : ఎమ్మెల్సీ



ఏర్పేడు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: ప్రతి గ్రామంలో రామాలయం నిర్మాణం ఆ గ్రామ ప్రజల ఆధ్యాత్మికతకు నిదర్శనం అన్ని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్ర మణ్యం అన్నారు. మండలంలోని మన్న సముద్రం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం మహాకుంబాభిషేకానికి ఆయన ముఖ్యఅతిధి హాజరయ్యారు. గ్రామ కమిటి ఆయనను ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు యువతకు మన సంప్రదాయాలు, సంస్కృతి మీద అవగాహన లేదన్నారు. గ్రామాల్లో రాయాలయాలుంటే అక్కడ పెద్దలు కూర్చొని యువతకు మార్గదర్శకంగా పురాణాలు, ఇతిహాసాలకు సంబంధించి అవగాహన కల్గిస్తారన్నారు. ఏర్పేడు మండలంలోని ప్రతి గ్రామంలో రామ మందిరం ఉంటుందని ఈ మండలంలో ప్రజలు ఆధ్యాత్మిక చింతన కల్గి ఉంటారన్నారు. మండలంలో కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. మన్నసముద్రం గ్రామం సోమవారం ఆధ్యాత్మికతతో శోభిల్లింది. గ్రామస్థులు నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాములవారి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో వన్నెరెడ్డి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమల రెడ్డి, యువత అధ్యక్షులు మునిశేఖర్, జయరామిరెడ్డి, మునిరెడ్డి, మునిరత్నం రెడ్డి, జయశంకర్ రెడ్డి, సురేష్, మహేష్, దొరబాబు, నాగరాజు, శేఖర్‌తో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పెద్దిరెడ్డీ.. కుప్పంలో అడుగుపెట్టనివ్వం

**- ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం - కుప్పంలో అలజడి సృష్టించాలని వస్తారా.. ఒక్కవార్డు కూడా గెలవనివ్వం!**



కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: ప్రశాంతతకు మారుపేరైన కుప్పం నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అడుగుపెట్టనివ్వమని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కుప్పంలో అలజడి సృష్టించాలని వైకాపా కుట్రలు చేస్తోందన్నారు. రెండున్నర ఏళ్లలో కుప్పంకు రాని పెద్దిరెడ్డి కుప్పంలో దౌర్జన్యాలు చేసేందుకు వస్తారా అని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి తన నియోజకవర్గం పుంగనూరును చూసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి చైర్మన్ జీఎం రాజు, రెస్కో చైర్మన్ ప్రతాప్‌కుమార్, మండల అధ్యక్షులు రాజగోపాల్, ఉదయ్‌కుమార్, సుబ్బు తదితరులు మాట్లాడుతూ వైకాపా పాలనలో జిఓ నెం 1 పేరిట కుప్పంలో సాక్షాత్తూ అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న సిఎం చంద్రబాబును అడ్డుకుని బీభత్సం సృష్టించారన్నారు. అప్పట్లోనే కుప్పంలో దోచుకున్నారన్నారు. కుప్పానికి పులివెందుల, పుంగనూరు సంస్కృతిలు అవసరం లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి తాము గెలిచిన పంచాయతీలను కూడా వారి ఖాతాల్లో వేసుకున్నారన్నారు. అకారణంగా తెదేపా నేతలను హత్యాయత్నం కేసుల్లో జైళ్లకు పంపారన్నారు. వందలాదిమందిపై కేసులు పెట్టారన్నారు. కుప్పంలో తెదేపా శ్రేణుల్ని రెచ్చగొట్టొద్దని పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో కుప్పంలో రూపాయి ఖర్చు చేయలేదని ఏ ముఖం పెట్టుకుని పెద్దిరెడ్డి కుప్పం వస్తారని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు, టిడిపికి నష్టం చేయాలనే ఆలోచన వారిదన్నారు. కుప్పంలో ఒక్కవార్డు కూడా వైకాపాకు వదిలే ప్రసక్తేలేదన్నారు. కుప్పానికి పెద్దిరెడ్డి, వైఎస్ జగన్ వచ్చినా ఏంకాదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, ఏరియా ఆస్పత్రి వైస్‌చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, మండల ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, కడ సభ్యులు రామచంద్ర, సుగుణమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఘన స్వాగతం



రేణిగుంట, సెప్టెంబర్ 7(ప్రభాతవార్త: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ ఫైర్‌బ్రాండ్ నేత యోగి ఆదిత్యనాథ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఒకరోజు పర్యటనలో భాగంగా ఆయన ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. యోగి పర్యటన నేపథ్యంలో విమానాశ్రయ పరిసరాల్లో రాజకీయ సందడి నెలకొంది. విమానాశ్రయంలో యోగి ఆదిత్యనాథ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాశ్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్, జనసేన రాష్ట్ర నాయకులు డాక్టర్ హరిప్రసాద్, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావుతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. యోగి ఆదిత్యనాథ్ రాక సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపించింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి హోదాలోనే కాకుండా బీజేపీ అగ్రశ్రేణి నేతగా యోగి ఆదిత్యనాథ్‌కు దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ ప్రాధాన్యత నేపథ్యంలో ఆయన పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. రేణిగుంట విమానాశ్రయంలో నాయకులు ఆయనను కలిసి అభివాదం చేసి స్వాగతం పలికారు. అనంతరం యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమాలను ముగించుకుని తిరిగి అదే హెలికాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో యోగి ఆదిత్యనాథ్‌కు ఉదయం స్వాగతం పలికిన నాయకులతో పాటు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి నారాయణ కూడా స్వాగతం పలికారు. ఆపై యోగి ఆదిత్యనాథ్ భారీ భద్రత మధ్య రోడ్డు మార్గంలో తిరుమల శ్రీవారి దర్శనార్థం బయలుదేరి వెళ్లారు. తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని రేణిగుంట విమానాశ్రయానికి రోడ్డు మార్గంలో వచ్చి అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. యోగి పర్యటన నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమల వరకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

## అభివృద్ధి పనుల కోసం క్వారీ అనుమతులు

**ఆర్డిఓ రామ్మోహన్**



పుత్తూరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్త : జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణాల కోసం గ్రావెల్ క్వారీలకు అనుమతులు ఇస్తున్నట్టు తిరుపతి ఆర్డిఒ రామ్మోహన్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తడుకు పంచాయతీలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తిరుపతి నుంచి చెన్నైకు రాకపోకలు సాగించేందుకు ఆరేడు గంటల సమయం పట్టేదని, రహదారుల నిర్మాణం వల్ల ఇపుడు కేవలం రెండున్నర గంటల వ్యవధిలో తిరుపతి నుంచి చెన్నైకు వెళుతున్నామని తెలిపారు. రోడ్ల నిర్మాణానికి గ్రావెల్ అవసరమైనందున తిరుపతి జిల్లా పరిధిలో పలు చోట్ల క్వారీలకు అనుమతులివ్వడం జరుగుతోందన్నారు, క్వారీల నిర్వహణ వల్ల స్థానికంగా కొన్ని ఇబ్బందులు ఏర్పడినప్పటికీ అభివృద్ధిని దృష్టిలో వుంచుకుని నిర్ణయం తీసుకోవాల్సి వుంటుందని తెలిపారు. క్వారీల యాజమాన్యం స్థానికులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు గ్రామాభివృద్ధికి సహాయం చేయాలని సూచించారు. సమావేశంలో తహశీల్దారు డి.సి.వెంకటేశ్వర్లు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు జిల్లా జడ్జి, కలెక్టర్‌లకు ఆహ్వానం



కాణిపాకం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగునున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు జిల్లా జడ్జి, కలెక్టర్‌లను ఆహ్వానిస్తూ సోమవారం ఆలయ చైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు ఆహ్వానపత్రికలను అందజేశారు. ఆలయంలో ఈనెల 14 నుండి అక్టోబర్ 7 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగునున్నాయి.



ఈమేరకు జిల్లా జడ్జి అరుణసారిక, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లను వారి వారి చాంబర్‌లలో ఆలయ చైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, అర్చకులు కలసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అలాగే బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఈఓ వివరించారు. ఈసందర్భంగా స్వామివారి ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, వేదపండితులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## భగవంతుడి సేవతో తిరుమల స్థానికుల రుణం తీర్చుకుంటా

### ఎస్వీబిసి చైర్మన్ శ్రీధర్ వర్మ



**తిరుపతి,సెప్టెంబర్ 7ప్రభాతవార్త:**
టిటిడిలో తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎస్వీబీసీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు నిర్వహించే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు బి. శ్రీధర్ వర్మ అన్నారు. తిరుమల వాసులకు ఎన్నో విధాలుగా సేవ చేసిన తన తండ్రి రామచంద్ర రాజు (ఎన్టీఆర్ రాజు) తనయుడిగా జన్మించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అన్నిటికంటే ముఖ్యంగా తిరుమల స్థానికుడిగా తనకు ఇంతటి కీలకమైన బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఆయన ఆశయాలకు అనుగుణంగా తన వంతు ప్రయత్నం చేస్తానని ప్రకటించారు. ఎస్వీబీసీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టినప్పటికీ తిరుమల స్థానికుల వెంటే నడుస్తానని వారికి ఎటువంటి సమస్యలు ఉన్నప్పటికీ తన దృష్టికి తీసుకొస్తే తన పదవి హోదా పక్కనపెట్టి ఒక స్థానికుడిగా వాటి పరిష్కారం కోసం టిటిడి యాజమాన్యంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఇకపై తిరుమల స్థానికులు అందరూ కలిసికట్టుగా వారి సమస్యల పరిష్కారం కోసం తన వెంట కలిసి రావాలని శ్రీధర్ వర్మ పిలుపునిచ్చారు. ఎస్వీబిసి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శ్రీధర్ వర్మను తిరుమల స్థానికులు సోమవారం ఘనంగా సత్కరించారు. తిరుమలలో వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న నాయకులు స్థానికులు, బాలాజీ నగర్ వాసులు, వ్యాపారులు, పొదుపు సంఘాల మహిళలు, డ్వాక్రా మహిళలు, అందరూ పార్టీలకతీతంగా శ్రీధర్ వర్మను తమలో ఒకడిగా స్థానికుడిగా భావించి సన్మానించేందుకు పోటీలు పడ్డారు. భవిష్యత్తులో శ్రీధర్ వర్మ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షి ంచారు. ఈ సన్మాన ఆత్మీయ సమ్మేళనానికి తిరుమల స్థానికులు ముఖ్య నాయకులు కె.పి, ఎం సత్యనారాయణ, దామోదరం, ముని రెడ్డి, మునికృష్ణయ్య, కె.వి ప్రభాకర్, వి. కృష్ణ, కే రాధాకృష్ణ, గిరి, బద్దెల సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

### – వైసీపీ కుల రాజకీయాలను ప్రేరేపిస్తున్నది
### – టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహా యాదవ్

**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు వారికి దగ్గరలో ఉన్న సచివాలయాలలో నమోదు చేసుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహా యాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసింహా యాదవ్ మాట్లాడుతూ 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, 2694 కోట్ల రూపాయలు ప్రతినెలా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని, ప్రతి ఒక్కరికి 1వ తారీకు ఇంటి వద్ద పింఛన్లు ఇచ్చే కార్యక్రమం ప్రభుత్వం చేస్తున్నదని, ఒకటవ తారీకు ప్రభుత్వ హాలిడే ఉంటే ముందు రోజే పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. గత వైసీపీ పాలనలో వ్యవస్థలన్నిటిని ధ్వంసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇతరత్రా వ్యవస్థలలో, అవినీతికి పాల్పడి, ప్రజాధనాన్ని లూటీ చేసిన ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. నిన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు మోహిత్ రెడ్డి మాట్లాడిన విధానాన్ని, పెద్దిరెడ్డి మాట్లాడిన తీరుని, కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డి, మాట్లాడిన విధానాన్ని చూస్తే రానున్న స్థానిక సంస్థలలో కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపు కోవాలని చూస్తున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు . స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తే, వైసీపీ నాయకుల ద్వారా కోర్టులలో కేసులువేసి అడ్డుకోవడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. ప్రజల కోసం ప్రజా సంక్షేమానికి పాల్పడుతున్న ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలంతా సహకారం అందించాలని కోరారు.

## వరదయ్యపాలెంలో, చుట్టుపక్క గ్రామాల్లో వేళాపాళాలేని విద్యుత్ కోతలు

**వరదయ్యపాలెం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
వరదయ్యపాలెం పట్టణంలో, చుట్టుపక్క గ్రామాల్లో రాత్రి సమయంలో వేళాపాళాలేకుండా విద్యుత్ కోతలు విధిస్తూ వున్నారు. కరెంటు కోత వలన పట్టణ ప్రజలు, పరిసర గ్రామాల్లో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో గ్రామాల్లో విద్యుత్ కోత వలన వీధిలైట్లు లేకపోవడం వలన విష సర్పాలు వీధుల్లో ఉండడం వలన గ్రామాల్లో ఉన్న ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. రాత్రి సమయంలో కరెంటు అంతరాయం వలన పసిబిడ్డలు గర్భిణీలు చదువుకునే పిల్లలు హాస్టల్లో ఉన్న పిల్లలు కరెంటు లేక పోవడం వలన చాలా ఇబ్బందికరంగా ఉందని బాధపడుతున్నారు. ముఖ్యంగా భోజనం చేసే సమయంలో కరెంటు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. అసలు ఎందుకు ఈ కరెంటు కోతలు జరుగుతున్నాయి..? కనీసం సమాచారం కూడా విద్యుత్ అధికారులు తెలపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతలతో వరదయ్యపాలెం పట్టణం చుట్టుపక్క గ్రామాలు అంధ కారంలో వున్నారు. రోజుకో సమయంలో విద్యుత్ కోతలను విద్యుత్తు అధికారులు విధిస్తున్నారు. ముందస్తు సమాచారం లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు అసలు ఎందుకు కరెంటు కోత, ఇది ఏమైనా వేసవికాలమా అంటూ ప్రజలు విద్యుత్ శాఖాధికారులును ప్రశ్నిస్తూ వున్నారు. కరెంటు కోతల వలన సమయపాలనపై స్పష్టత లేక వరదయ్యపాలెం పట్టణ ప్రజలు, చుట్టుపక్క గ్రామ ప్రజల్లో అయోమయంలో వున్నారు. రాత్రి సమయంలో కరెంటు కోతలతో భద్రతపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో కన్నెత్తి చూడని సంబంధిత అధికారులు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ కోతల మీద దృష్టి సారించి న్యాయం చేయాలని వరదయ్యపాల్యెం పట్టణ ప్రజలు, పరిసర గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో నిరక్ష్యం తగదు..

### :జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:..**



జిల్లాలోని అన్ని మండలాల్లో రీసర్వే ప్రక్రియ, ఈ కేవైసీ ప్రక్రియ, కోర్టు కేసులు, సివిల్ సప్లైస్ సేవలను నిర్దేశించిన కాలపరిమితి ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని మిని విసి హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ డిఆర్ఓ జి.నరసింహులుతో కలసి తహశీల్దార్లతో జిల్లాలోని పలు మండలాల పరిధిలో జరుగుతున్న రీసర్వే, ఈకేవైసీ ప్రక్రియ, పి జి ఆర్ ఎస్ దరఖాస్తుల పురోగతి, సర్వే రికార్డులు, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామాంజనమ్మ, ఆర్డిఓ లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, కోర్టు కేసులు, ఎస్ఐఆర్ పెండింగ్ అంశాలను అత్యున్నత ప్రాధాన్యతతో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని, తహశీల్దార్లు, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షి స్తూ జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయి సిబ్బంది నుండి ఆర్డీవోల వరకు అందరూ సమన్వయంతో పనిచేసి రీసర్వే మరియు పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తిరుపతి రూరల్, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, రైస్ కార్డ్ సేవలను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసి, సెప్టెంబర్ 1–15 మధ్య పంపిణీ సమయంలో అన్ని లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తి చేయడంతో పాటు మరణించిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. రీసర్వేలో ఫేజ్1 నుంచి ఫేజ్6 లక్ష్యాలను సాధించి, గ్రౌండ్ ట్రూతింగ్ అనంతరం వెక్టొరైజేషన్, సంబంధిత లాగిన్ ప్రక్రియలను 4–5 రోజుల్లో పూర్తి చేయాలని, సెప్టెంబర్ 15 నాటికి నాణ్యమైన పనులు పూర్తి చేసి అక్టోబర్ సైకిల్‌కు 85 శాతానికి పైగా ఈకేవైసీ సాధించాలని ఆదేశించారు.

## కార్పొరేషన్ ఎన్నికలపై జనసేన కసరత్తు

### పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం..





**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**
తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఎన్నికల్లోఅనుసరించాల్సిన వ్యూహం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, నాయకులు– కార్య కర్తల సమన్వయంపై సోమవారం తిరుపతిలోని ఓ ప్రముఖ హోటల్‌లో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే ధర్మరాజు సమావేశంలో పాల్గొని పార్టీ నేతలతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతోనూ ధర్మరాజు సమావేశమై కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి స్థానిక పరిస్థితులు, పార్టీ కార్యాచరణ, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలో మరోసారి సమావేశమై ఎన్నికల కార్యాచరణను ఖరారు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశాల్లో జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, అధికార ప్రతినిధి కీర్తన, సమన్వయ కమిటీ సభ్యుడు క్రికెట్ విజయ్‌తో పాటు బాబ్జీ, అనిల్, నయూమ్, భాషా, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్‌కు స్వాగతం



**తిరుపతి,సెప్టెంబర్ 7ప్రభాతవార్త:**
జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి సత్య కుమార్‌కి తిరుపతిలో సోమవారం ఘన స్వాగతం లభించింది. బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ,బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, బిజెపి నాయకులు నవీన్ రాయల్, రామ్ కుమార్, విధ్వాన్ కస్పా పద్మనాభం, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

## సహజ రత్నాల ఆభరణాలకు సరికొత్త రూపం

### నైరా కలెక్షన్‌ను విడుదల చేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

**తిరుపతి విద్య సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**




సహజ రత్నాల సౌంద ర్యాన్ని సంప్రదాయ ఆభ రణాల తయారీ నైపుణ్యం తో మేళవిస్తూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నైరా పేరుతో సరికొత్త ఆభరణాల కలెక్షన్‌ను విడుదల చేసింది. ప్రము ఖ నటి, మోడల్ శ్రీనిధి శెట్టి ఈ కలెక్షన్‌కు ముఖ చిత్రంగా వ్యవహరిస్తు న్నారు. నైరా కలెక్షన్ ఆవి ష్కరణతో పాటు ఆంధ్రప్ర దేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ ను ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. ప్రకృతి ప్రసాదించిన అరుదైన సహజ రత్నాల నుంచి స్ఫూర్తి పొందిన నైరా కలెక్షన్‌లో సంప్రదాయ ఆభరణాల తయారీ కళను ఆధునిక డిజైన్లతో మేళవించినట్లు పేర్కొంది. బంగారంతో రూపొందించిన ఆభరణాల్లో విలువైన సహజ రత్నాలను పొదిగి, సంప్రదాయ శిల్పకళకు ఆధునిక రూపాన్ని అందించారు. కొత్తతరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా విభిన్న డిజైన్లలో ఈ కలెక్షన్‌ను రూపొందించినట్లు తెలిపింది. జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ లో భాగంగా ప్రత్యేకంగా ఎంపిక చేసిన సహజ రత్నాలు, అన్‌కట్ ఆభరణాలను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ వెల్లడించింది. రత్నాలు, అన్‌కట్ ఆభరణాల తరుగు ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్ సెప్టెంబరు 14 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ సహజ రత్నాల ఆభరణాలు ప్రకృతి సౌందర్యం, హస్తకళా నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. సరికొత్త డిజైన్లు, అత్యున్నత పనితనంతో సహజ రత్నాలను అందించాలనే ఉద్దేశంతో నైరా కలెక్షన్‌ను రూపొందించినట్లు తెలిపారు. నాణ్యత, పారదర్శకత, నమ్మకమైన కొనుగోలు ప్రమాణాలకు ప్రాధాన్యం ఇస్తూ ఆభరణాల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

## తిరుపతిలో యథేచ్ఛగా నకిలీ స్టిక్కర్ల దందా

### - పోలీస్, ప్రెస్, జ్యూడిషల్, రెవిన్యూ, గవర్నమెంట్- డ్యూటీ, హుమానరైట్స్‌బోర్డులతో తిరుగుతున్న అక్రమార్కులు
### - ఐడి కార్డులు పరిశీలించి నకిలీ స్టిక్కర్లు తొలగించాలి - మోసగాళ్లపై కఠిన చర్యలు చేపట్టాలి










**తిరుపతి క్రై, సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**
ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో వాహనాలపై అనధికారిక స్టిక్కర్ల హల్చల్ మితిమీరిపోతోంది. నగరంలో తిరిగే వందలాది ప్రైవేట్ వాహనాలపై ప్రెస్, పోలీస్, గవర్నమెంట్ ఆన్ డ్యూటీ, హ్యూమన్ రైట్స్, జ్యుడీషియల్, మొదలగు బాధ్యతాయుతమైన శాఖలకు సంబంధిత లోగోలతో బోర్డులు దర్శనమిస్తున్నాయి. పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి, టోల్ గేట్ల వద్ద ఫీజు ఎగ్గొట్టడానికి, అలాగే సమాజంలో ఒక ప్రత్యేక హోదాను చూపించుకోవడానికి కొందరు అక్రమార్కులు ఈ బోర్డులను అడ్డదారిగా వాడుకుంటున్నారు. దీనివల్ల నిజాయితీగా పనిచేసే అసలైన జర్నలిస్టులకు, పోలీస్ సిబ్బంది, అలాగే ఉన్నత శాఖలో విధులు నిర్వహించే ఉద్యోగులకు చెడ్డపేరు రావడమే కాకుండా, నగర భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీనిపై జిల్లా పోలీస్ యంత్రాంగం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని అసలైన ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు నకిలీ స్టిక్కర్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినప్పటికీ మళ్లీ కొన్ని రోజులకు వాహనదారులు అదేవిధంగా నకిలీ స్టిక్కర్లు వినియోగిస్తూ హల్చల్ చేస్తున్నారు. ఇటువంటి స్పెషల్ డ్రైవ్ లు ఒక్కరోజుకి పరిమితం కాకుండా తరచూ నిర్వహిస్తూ మోసగాళ్లపై కఠిన చర్యలు చేపట్టాలని అసలైన ఉద్యోగులు కోరుతున్నారు.

#### బోర్డుల వెనుక జరుగుతున్న అసలు మోసం

#### - నకిలీ ప్రెస్ బోర్డుల హల్చల్:

జర్నలిజంతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, చివరకు చిన్న చిన్న నేరగాళ్లు సైతం తమ వాహనాలపై ప్రెస్ అని రాసుకుని తిరుగుతున్నారు. కేవలం వంద రూపాయలు ఇస్తే రేడియం షాపుల్లో ఈ స్టిక్కర్లు సులువుగా లభిస్తుండటంతో వీటి దుర్వినియోగం పెరిగిపోయింది. పోలీసుల పేరుతో బురిడీ:కొందరు ప్రైవేట్ వ్యక్తులు తమ బంధువులు ఎవరో పోలీస్ శాఖలో ఉన్నారనే సాకుతో తమ సొంత వాహనాలకు పోలీస్ బోర్డులు తగిలిస్తున్నారు. ఇది పోలీస్ శాఖ ప్రతిష్టను దెబ్బతీస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల ముసుగులో:విధుల్లో లేని సమయంలో కూడా ప్రైవేట్ వాహనాలకు గవర్నమెంట్ లేదా ఆన్ డ్యూటీ బోర్డులను తగిలించి రౌడీయిజం చెలాయిస్తున్న ఘటనలు నగరంలో కనిపిస్తున్నాయి.

#### – నకిలీ స్టిక్కర్లపై పోలీసుల నామమాత్ర డ్రైవ్‌లు

గతంలో తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అయితే ఈ స్పెషల్ డ్రైవ్ ఒక్క రోజుకే పరిమితం కావడంతో అక్రమార్కులు మరోసారి స్టిక్కర్లు వేసుకుని యాదేశ్చగా తిరుగుతున్నారు. నగరంలోని ప్రధాన కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఇలాంటి నకిలీ బోర్డులను అక్కడికక్కడే తొలగించాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. ప్రెస్ లేదా పోలీస్ బోర్డులు ఉన్న వాహనాలను ఆపి, వారి అసలైన గుర్తింపు కార్డులను ఒరిజినల్ ఐడి కార్డ్స్ క్షుణ్ణంగా పరిశీలించి నకిలీ గుర్తింపు కార్డులతో తిరిగే వారిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలి. కేవలం స్టిక్కర్లు తొలగించి వదిలేయకుండా, భారీగా జరిమానాలు విధించడం లేదా వాహనాలను సీజ్ చేయడం లాంటి చర్యలు చేపడితేనే ఈ దందాకు అడ్డుకట్ట పడుతుంది అని ఉద్యోగాలు వాపోతున్నారు. తిరుపతి నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం, అలాగే నిజమైన జ్యూడిషల్, ప్రెస్, పోలీస్, రెవిన్యూ మొదలగు ఉన్నత శాఖలలో విధులు నిర్వహించే ఉద్యోగుల గౌరవాన్ని కాపాడటం కోసం జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించి ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలని తిరుపతి నగర ఉన్నత శాఖ ఉద్యోగులు, మేధావులు కోరుకుంటున్నారు.

## డిగ్రీ చదువుకు ఇదే మంచి అవకాశం!

### అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలకు 15 వరకు గడువు

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**



డిగ్రీ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు డా.బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మరో అవకాశం కల్పించింది. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలోని విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రంలో వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ (ఆనర్స్) కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉద్యోగాలు, ఇతర కారణాలతో క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కాలేని వారికి సార్వత్రిక విద్యా విధానం ద్వారా డిగ్రీ విద్యను కొనసాగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ చదువును మధ్యలో నిలిపివేసిన వారు, ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధ్యయన కేంద్రం నిర్వాహకులు సూచించారు. దరఖాస్తు ప్రక్రియ, కోర్సులకు సంబంధించిన ఇతర వివరాల కోసం అధ్యయన కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. వివరాలకు 08772249607, 7382929617 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## బైండ్ ఓవర్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### రౌడీషీటర్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ



**రేణిగుంట సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**
బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి నేరానికి పాల్పడిన రౌడీషీటర్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు తిరుపతి జిల్లా పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు రౌడీషీటర్లు, పునరావృత నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగుతోంది. ఎస్పీ ఆదేశాలతో, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్బన్ సీఐ ఎస్. జయచంద్ర చర్యలు చేపట్టారు. రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లికి చెందిన రౌడీషీటర్ బండి జయచంద్ర (26) పై గతంలో రేణిగుంట, రైల్వే కోడూరు, గాజులమాండ్యం, ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఆరు కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ ఏడాది మే 2న అతడిని రేణిగుంట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండ్ ఓవర్ చేశారు. అయితే గత నెల 17న బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించి మద్యం సేవించి గొడవకు పాల్పడి, వ్యక్తులపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి సోమవారం రేణిగుంట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్(తాహసిల్దార్) శ్రావణ్ కుమార్ ఎదుట హాజరుపరచగా, విచారణ అనంతరం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నేరప్రవృత్తిని విడిచిపెట్టి సత్ప్రవర్తనతో జీవించాలని. బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఎస్వీయూలో పరిశోధనపై ఫ్యాకల్టీకి శిక్షణ

### డేటా విశ్లేషణలో నైపుణ్యం అవసరం.. పది రోజుల శిక్షణ ముగింపు



**తిరుపతి విద్య సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామెట్రిక్స్, సోషియాలజీ ఆధ్వర్యంలో పది రోజులపాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా వామన్‌రావు భవన్‌లోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో వాలెడిక్టరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ చంద్రశేఖర్ బాయి, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక శాస్త్ర పరిశోధన ద్వారా సమాజంలోని సమస్యలను అధ్యయనం చేసి, వాటికి తగిన పరిష్కార మార్గాలను సూచించవచ్చన్నారు. దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో వస్తున్న మార్పులను అధ్యయనం చేసేందుకు నాణ్యమైన డేటా సేకరణ, విశ్లేషణపై పరిశోధకులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎస్‌పీఎస్ఎస్ వంటి సాఫ్ట్‌వేర్ ద్వారా వివిధ గణాంక పరీక్షలు, టూల్స్‌ను ఉపయోగించి డేటాను సమర్థవంతంగా విశ్లేషించడం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన పరిశోధనా వ్యాసాలను ప్రచురించి దేశ పరిశోధన, అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. భవిష్యత్తులో ఆర్ట్స్ కాలేజీలోని పరిశోధక విద్యార్థులు ఉచితంగా వినియోగించుకునేలా కంప్యూటర్ ల్యాబ్‌లో ఎస్‌పీఎస్ఎస్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి పరిశోధన అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. కార్యక్రమ కోఆర్డినేటర్లు డాక్టర్ కుసుమ, డాక్టర్ సునీత మాట్లాడుతూ, పది రోజుల శిక్షణ కార్యక్రమంలో సుమారు 90 మంది ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. డేటా కలెక్షన్, డేటా అనాలిసిస్, రీసెర్చ్ ఎథిక్స్, ప్లేజరిజం, ఎస్‌పీఎస్ఎస్, రీసెర్చ్ డిజైన్, టేబుల్ ఫార్మేషన్ తదితర అంశాలపై నిపుణులైన రిసోర్స్ పర్సన్‌ల ద్వారా శిక్షణ అందించినట్లు వివరించారు. కార్యక్రమానికి నిధులు మంజూరు చేసిన అధికారులు, సహకరించిన కోఆర్డినేటర్లు, యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి, యూపీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాత వార్త**
తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతిలోని రుయా ఆస్పత్రి అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఒక రోజు తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా పర్యటన సందర్భంగా యూపీ ముఖ్యమంత్రికి అవసరమైన స్వాగత ఏర్పాట్లలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## కొత్త పింఛన్ల, ప్రభుత్వ పనితనానికి నిదర్శనం



తొట్టంబేడు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న పేదలకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పడంపై తొట్టంబేడు టిడిపి మాజీ మండల అధ్యక్షులు, గాలి మురళినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పింఛన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కొనియాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనడానికి ఇదే నిదర్శనమన్నారు. వైసీపీ హయాంలో అనర్హులకు పింఛన్లు దోచిపెట్టి అర్హులకు అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక అనర్హులను ఏరివేసి నిజమైన అర్హులకు న్యాయం చేస్తోందని అన్నారు. నూతన పింఛన్ల మంజూరు నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి గాలి మురళి నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## రామాలయానికి ఉయ్యాల వితరణ



తొట్టంబేడు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: మండలంలోని తాటిపర్తి పంచాయతీ పరిధిలోని తాటిపర్తి ఎస్సీ కాలనీలో నూతనంగా వెలసిన శ్రీరాములవారి మందిరం సోమవారం భక్తి శ్రద్ధలతో కోలాహలంగా మారింది. స్వామివారి మందిరానికి ఉయ్యాలను బహూకరిస్తామని మొక్కుకున్న తొట్టంబేడు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం, వారి సతీమణి కోగిల మునికుమారి దంపతులు తమ మొక్కును నెరవేర్చుకుంటూ స్వామివారికి, అమ్మవారికి అత్యంత సుందరమైన ఉయ్యాలను సమర్పించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు దంపతులు ఉన్నం నిర్మలమ్మ ముఖ్య అతిథులుగా విచ్చేసి తమ చేతుల మీదుగా ఉయ్యాలను ఆలయానికి అందజేశారు. మాజీ సర్పంచ్ కోగిల నాగేంద్ర, శోభన్ నాయుడు, కోగిల శంకరయ్య, కుక్క శంకరయ్య, మునిరాజారెడ్డి, పెరుమాల్ రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం తదితర నాయకులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థకు 38 వినతులు

### -కమిషనర్ ఎం.జయకృష్ణ

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 32 వినతులు వచ్చాయని కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 12 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 26 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. శివజ్యోతి నగర్ లో రోడ్డులో యూడీఎస్ కాలువలు, సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, ఎమ్మార్ పల్లి టీటిడి ఫ్లాట్స్‌లో తెలుగుగంగ నీరు సక్రమంగా రావడం లేదని, ప్రకాశం పార్కు నందు వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయించాలని, శ్రీనివాసపురంలో ఉన్న వేస్ట్ షాప్ వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, మంచాల వీధిలో తెలుగుగంగ లైన్ కొరకు తవ్విన కాలువలు పూడ్చాలని, ఎన్.జి.ఓ. కాలనీలో రోడ్లపై పార్కింగ్ ఎక్కువయ్యిందని, కపిలతీర్థం కాలువలో పిచ్చి మొక్కలు ఎక్కువ కావడం వలన దోమలు ఎక్కువగా ఉన్నాయి పరిష్కరించాలని, పాత మునిసిపల్ ఆఫీస్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయలేదు పరిష్కటించాలని, ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఆయా విభాగాల అధికారులకు పంపి చర్యలు చేపడతామని కమిషనర్ తెలుపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## స్విమ్స్ సంచాలకులకు సన్మానం



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : నూతనంగా స్విమ్స్ సంచాలకులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ గుడారు జగదీష్‌ని వారి కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా స్విమ్స్ హాస్పిటల్ నందు వైద్యం కోసం ఎక్కడెక్కడ నుండో మంచి వైద్యం కోసం వస్తుంటారని స్విమ్స్‌కి పూర్వవైభం తీసుకుని రావడానికి చాలా సంస్కరణలు చేయదల చినట్లు వారు తెలియజేశారు. జగదీష్‌కి వైద్య వృత్తిలో ఉన్నటువంటి అనుభవ నంత రంగలించి స్విమ్స్ అభివృద్ధికి శాయశక్తుల కృషిచేసి రాష్ట్రంలో నెంబర్ వన్ వైద్య ఇన్స్టిట్యూట్‌గా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలియజేశారు. మీరు కూడా ఏవైనా సూచనలు సలహాలు ఇస్తే ఖచ్చితంగా స్వీకరిస్తానని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. వారి నాయకత్వంలో స్విమ్స్ హాస్పిటల్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా మంచి హాస్పిటల్‌గా అభివృద్ధి చెందాలని నాయకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, తిరుపతి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్ పి శ్రీనివాసులు, ఆనంద్ గౌడ్, ధనంజయులు, వాణి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ... అవార్డులతో స్విమ్స్‌కు కీర్తి కిరీటం

### - స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ జగదీష్‌ను కలిసిన అవార్డు గ్రహీతలు







తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్)కు చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన వైద్యులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుని స్విమ్స్ ప్రతిష్టను ఇనుమడింపజేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహి ంచిన కార్యక్రమంలో 05.09.26వ తేదీన విజయవాడలో జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో స్విమ్స్‌కు చెందిన జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై. ముత్తీశ్వరయ్య, సర్జికల్ ఆంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ బి. మణిలాల్ రాష్ట్రస్థాయి మెడిసిన్ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. అవార్డులు అందుకున్న వైద్యులు సోమవారం స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ వారిని ఘనంగా అభినందించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్విమ్స్‌కు చెందిన డా. వై. ముత్తీశ్వరయ్య మరియు ప్రొఫెసర్ డా. బి. మణిలాల్‌ల ప్రతిష్ఠాత్మక అవార్డులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. వైద్య సేవలు, బోధన, పరిశోధన రంగాల్లో వారు అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించడం స్విమ్స్‌కు గర్వకారణమని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ తెలిపారు. వారి సేవలు స్విమ్స్ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేస్తున్నాయని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కోరికలను త్యజిస్తే...మానవుడు దేవుడవుతాడు

### -ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి



శ్రీకాళహస్తి సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: మానవుడు తన జన్మ రహస్యాన్ని తెలుసుకొని ఆశ,కోరికలను త్యాజిస్తే మానవుడు దేవుడౌతాడని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి అన్నారు. శ్రీకాళహస్తిలోని ఎస్‌డికె నగర్‌లో బ్రహ్మకుమారి ఈశ్వరీయ నూతనశాఖ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. సోమవారం జరిగిన కార్యక్రమాల్లో మరో ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పరిపూర్ణా నందగిరి స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ నేడు సమాజం ఆశల వలయంగా మారిందన్నారు. స్వామి ప్రతి వాక్యంలోనూ 'మనం ఆణిముత్యాలమని' సంబోదించారు. ఈశ్వరీయ అనేది పరమేశ్వరుడు, బ్రహ్మకుమారిలకు ఈశ్వరుడు అండగా ఉంటాడన్నారు. నేడు ఈశ్వరీయ బ్రహ్మపిత సమాజం అందిస్తున్న సేవలు అనిర్వచనీయం అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక హితమే బ్రహ్మకుమారి సమాజం లక్ష్యంగా ముందుకు సాగటం వారిలోని సేవకు నిదర్శనం అన్నారు. శ్రీకాళహస్తిలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎస్.డి.కె నగర్‌లో నూతన శాఖను సోమవారం అతిధులు పూజలు నిర్వహించిన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అతిధులను రమణి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గీతా, రమణి సిస్టర్, మధు, కృష్ణ, పలువురు భక్తులు, సాధకులు పాల్గొన్నారు.

## గో సంరక్షణకు విరాళం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న గోశాలకు, గోసంరక్షణకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. ఈ నేపథ్యంలో హైదరాబాదుకు చెందిన మదినేని నాగేశ్వరరరావు కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఎఇఓ లోకేష్‌బాబు ఆలయంలో నిర్వహి స్తున్న వివిధ పథకాలకు సంబంధించి వివరించారు. వారు స్పందిస్తూ గోసం రక్షణ పథకానికి రూ. 51,116లు విరాళం అందించారు. వారికి ఆలయ ంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. దర్శనం ఏర్పాట్లను ఎపిఆర్‌ఓ రవి పర్యవేక్షించారు.

## మృత్యుంజయునికి విశేషాభిషేకాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ప్రతి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించుటకు ఆదేశించారు. దాంతో సోమవారం మృత్యుంజయ స్వామికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. తరువాత ప్రత్యేకాలంకారం జరిపారు. ఈ ఆలయంలో వెలసిన మృత్యుంజయ స్వామిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు.

## శివయ్య సేవలో తెలంగాణ జనసేన ఇన్‌చార్జి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన వాయులింగేశ్వరుని ఆలయానికి హైదరాబాదుకు చెందిన భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర జనసేన ఇన్‌చార్జి ఎన్. శంకర్ గౌడ్ పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో పార్టీకి చెందిన జయప్రకాష్, కుమార్‌లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఇటు ఆంధ్ర రాష్ట్రంలోనూ, తెలంగాణాలో పార్టీ బలోపేతమౌతుందన్నారు. పార్టీ నాయకుని లక్ష్యం నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు దక్కాలనటం. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు కేటాయించిన స్థానాల్లో విజయం సాదించాలని సూచించారు.

## బస్సుల్లేక ప్రయాణీకుల ఇక్కట్లు



తొట్టంబేడు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఎపియస్ ఆర్‌టిసి డిపో నుంచి వివిధ ప్రాంతాలకు బస్సుల్లేక ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. తమ బాధలను ఎవరికి విన్నవించుకోవాలో తెలియక తికమక పడుతున్నారు. గతంలో చెన్నైకు రెగ్యులర్‌గా బస్సులు నడిచేవి. ఇక తిరుపతి, తిరుమలకు అనుకూలంగా బస్సులు నడిచేవి. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా కొరవడింది. చెన్నైకు వెళ్ళే బస్సులు పాయింట్‌కు వస్తాయో లేదో తెలియని ఆయోమయం. వేకువ జామున వెళ్ళే బస్సుల గమనం ప్రశ్నార్థకంగా మారింది. అంతేకాక తమిళనాడు బస్సులు కూడా వేకువజామున సకాలంలో రావటం లేదు. దాంతో తమిళనాడు ఆర్‌టిసికి చెందిన తిరుపతి–చెన్నై బస్సుల మీద ప్రయాణీకులు ఆధారపడాల్సి వస్తుంది. వారు సాధారణ బస్సులతో పాటు ఎసి బస్సులను కూడా నడుపుతున్నారు. కానీ శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో నిర్వాహకులు పట్టణాలకు కాదు కదా గ్రామాలకు కూడా సక్రమంగా బస్సులు నడపలేని దుస్థితి చోటు చేసుకుంది. తిరుపతికి వెళ్ళాలన్నా డిపోలో గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి చోటు చేసుకుంది. దాంతో డిపోలోకి పల్లెవెలుగు బస్సులు వచ్చినా ప్రయాణీకులు పరుగులు తీస్తూన్నారు. ఇక పల్లెవెలుగు బస్సులు ఆపకుండా పరుగులు తీయిస్తున్నారు.

## జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీకాళహస్తి విద్యార్థి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రాంతికుమార్ అనే క్రీడాకారుని సోమవారం శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐ వెంకటేష్, రూరల్ సిఐ ఇబ్రహీంలు సత్కరించారు. శ్రీకాళహస్తికి చెందిన క్రాంతికుమార్ ఇటీవల నెల్లూరులో జరిగిన 12వ సీనియర్ స్త్రీ పురుషుల అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2026లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో తమ ప్రతిభా పాటవాలతో జాతీయస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ క్రీడాకారుని ప్రతిభను మరింత ప్రోత్సహించుటకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదువుల్లోనే కాకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు.

## మట్టి మాఫియాను అరికట్టండి

### -ఆర్డిఓకి ఇండియా కూటమి వినతి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం గుండెలిగుంటకు చెందిన చంద్రశేఖర్ మట్టి మాఫియా ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన నేపథ్యంలో ఇండియా కూటమి మిత్రపక్షాలు సోమవారం శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా మట్టి మాఫియా కారణంగా రెండు మరణాలు సంభవించాయని, అధికారులు మట్టి మాఫియాపై కొరడా ఝుళిపించి అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శులు గండం మణి, పుల్లయ్య, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎస్.జాకీర్, మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, సీఐటీయూ నాయకులు గురవయ్య, ఐఎఫ్ టీయూ నాయకులు బాల, ఏఐటీయూసీ నాయకులు శివకుమార్, చందు, అజిత్, నాగరాజు, జోసెఫ్, చరణ్, రఫీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి...ఏఐఎస్ఎఫ్ భారీ ర్యాలీ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : యువతను డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉంచేందుకు, మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలికి పోలీసుల సహకరించారు. ర్యాలిలో భారీ ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. వారు చేతుల్లో ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలిలో పాల్గొన్నారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ నాలుగు మాడ వీధుల మీదుగా సాగింది. డ్రగ్స్ వద్దు, గంజాయి వద్దు, మహిళలపై నేరాలు అరికట్టాలి, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి, హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలంటూ 500 మంది విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళల భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడితే కుటుంబాల భవిష్యత్తు దెబ్బతింటుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు కలిసి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సి ఐ వెంకటేష్ టూ టౌన్ సీఐ నాగరాజు రూరల్ సీఐ ఇబ్రహీం, ఏఐఎస్ఎఫ్ నాయకులు చైతు, సూర్య, ముఖేష్, భరత్, అర్జున్, సంతోష్, చరణ్, అభి, శివ తదితరులు పాల్గొన్నారు.

## అంకాళమ్మ ఆలయానికి...రూ.50వేలు విరాళం



శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి సమీపంలోని చెర్లోపల్లి దళితవాడలో నూతనంగా నిర్మించిన అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయ కుంబాభిషేకం కార్యక్రమాలకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయనకు గ్రామ పొలిమేరల నుంచి మేళ తాళాలు తప్పెట్ల మోతతో స్వాగతం పలికారు. అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయం నిర్మాణం కుంబాభిషేకం సందర్బంగా గ్రామాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. చెర్లోపల్లి గ్రామ దళితవాడ భక్తి పారవశ్యంతో పులకించింది. గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, వైఎస్ఆర్సీపీ నాయకులు, యువత ఘన స్వాగతం పలికి ఆలయ ప్రాంగణానికి వెళ్లారు. ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా యాభై వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మావిళ్లపల్లి వెంకటేశ్వర్లు నాయుడు, దాసరి హరి, రాధాకృష్ణారెడ్డి, సీఎం రాజా, కళ్యాణ్, పులి లడ్డు, ముప్పాల మురళి, పులి మణి, సుకుమార్, భాస్కర్, నారాయణ, రాజేష్, మహదేవ్, సోహెల్, ప్రహ్లాద్, వినయ్ తదితర వైఎస్ఆర్సీపీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## డ్రైవర్‌కు జైలు శిక్ష రూ.10 వేల జరిమానా!

తొట్టంబేడు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: మద్యం తాగి వాహనం నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన తొట్టంబేడు మండలం మామిడిగుంట గ్రామానికి చెందిన ధనశేఖర్ అనే ప్రైవేట్ బస్సు డ్రైవర్ కు శ్రీకాళహస్తి స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టు 5 రోజుల జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. మద్యం తాగి ప్రైవేట్ బస్సు నడుపుతుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజల భద్రత దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు.